క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



మరిపెడ రూరల్ : సీఎం సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి సీఎం సహాయ నిధి నుంచి రూ.45 వేల చెక్కు మంజూరు కాగా, కోట వెంకట్‌రెడ్డి అందజేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జోగిరెడ్డి, కోట మధుసూదన్‌రెడ్డి, అబోతు మహేందర్, బానోత్ బోడియా, పుల్లయ్య, సూత్రపు వెంకన్న, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జాగటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని హోలీ ఫైర్ మినిస్ట్రీస్ చర్చిలో ఎన్ఎస్‌యూఐ గూడూరు మండల అధ్యక్షుడు పోలెపాక అమరేందర్ గురువారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్ : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన రివిజనిజంకు వ్యతిరేకంగా కొత్తగూడెంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మదార్ తెలిపారు.సదస్సు కరపత్రాలను పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో రివిజనిజానికి వ్యతిరేకంగా అనేక సంవత్సరాలుగా న్యూడెమోక్రసీ పోరాడుతోందని తెలిపారు. రివిజనిస్టు విప్లవకారులను ప్రజలను తిరస్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె బాబన్న, ఉపేందర్, కె.భాస్కర్‌రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ మహాసభలను..

కొత్తగూడ : తుడుందెబ్బ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల మనుగడ కోసం రాజ్యాంగంలో పొందు పరిచిన చట్టాలు, హక్కుల అమలుకై ఆదివాసీలు ఉద్యమించాలని తెలిపారు. లేదంటే ఓటు బ్యాంకు రాజకీయంలో అస్తిత్వం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జనవరి 12న హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే మహాసభకు ఆదివాసీ ఉద్యోగులు, మేధావులు, యువకులు, విద్యార్థులు, రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో ఈక విజయ్, సంజీవ, నర్సింగరావు, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఎడ్ల బహూకరణ

- స్వచ్ఛంద సంస్థ కొనుగోలు చేసి రైతుకు వితరణ



సాక్షి స్పందన

కురవి: మండలంలోని కందికొండ గ్రామానికి చెందిన తొడుసు వీరన్న అనే రైతుకు దాత జత ఎడ్లను గురువారం కొనుగోలు చేసి అందజేశారు. ఈనెల 23న కందికొండ గ్రామంలోని నాగులకుంటలో మంచినీళ్లు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి రెండు ఎడ్లు మృతి చెందిన విషయం విదితమే. సాక్షిలో 24న 'కుంటలో పడి కాడెడ్లు మృత్యువాత' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన వరంగల్‌కు చెందిన అరకపూడి సేవా ట్రస్టు స్వచ్ఛంద సంస్థ తరఫున సంస్థ చైర్మన్ అరకపూడి రఘు గురువారం జత ఎడ్లను కొనుగోలు చేసి రైతు తొడుసు వీరన్నకు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

ముసుగు తొలగేనా?

- వర్షం కారణంగా వాయిదా
- ప్రారంభోత్సవాలకు నోచుకోని వివేకానంద, కొమురం భీమ్ విగ్రహాలు

మహబూబాబాద్ : రోడ్డు విస్తరణలో భాగంగా కొన్నేళ్ల క్రితం స్వామి వివేకానంద విగ్రహంతో పాటు కొమురంభీమ్ విగ్రహాన్ని తొలగించారు. కాగా తొలగించిన విగ్రహాలను ఏర్పాటు చేయాలని పలు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేసి మున్సిపల్ కమిషనర్‌కు, చైర్మన్‌కు వినతులు ఇచ్చారు. ఎట్టకేలకు తొలగించిన విగ్రహాలను మళ్లీ ఏర్పాటు చేశారు. అయితే ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో ఆయా విగ్రహాల ముసుగులు అలాగే ఉన్నాయి.

జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లో కొన్నేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని వివేకానంద సెంటర్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహంతో పాటు కొమురం భీమ్ విగ్రహాలను తొలగించారు. అనంతరం వాటిని జమాండ్లపల్లి రోడ్డులోని ఫిల్టర్ బెడ్ ప్రాంతానికి తరలించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయినా విగ్రహాల ఏర్పాట్లను మరిచిపోయారు. దీంతో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. తొలగించిన విగ్రహాలు కూడా పనికి రాకుండా పోవడంతో మున్సిపల్ సాధారణ నిధులతో మళ్లీ వాటిని తయారు చేయించారు. ఒక్కో విగ్రహానికి రూ.9.72 లక్షలు ఖర్చు చేశారు. స్వామి వివేకానంద జంక్షన్‌లో స్వామి వివేకానంద విగ్రహం, బస్టాండ్ జంక్షన్‌లో కొమురం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాని నేటికి ఆయా విగ్రహాల ప్రారంభోత్సవం కాక ముసుగు తొలగలేదు.



ముసుగు వేసి ఉన్న స్వామి వివేకానంద విగ్రహం



ముసుగు తొలగని కొమురం భీమ్ విగ్రహం

నాలుగు నెలల క్రితంముహూర్తం ఖరారు

2024, ఆగస్టు 7వ తేదీన విగ్రహాల ప్రారంభోత్సవాలకు ముహూర్తం ఖరారు చేశారు. దానికి తగ్గట్లు అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ వర్షం కారణంగా ప్రారంభోత్సవాలను వాయిదా వేశారు. దీంతో విగ్రహాల ముసుగులు అలాగే ఉండిపోయాయి. వాటికి వేసి ముసుగులు ఎండకు, వానకు చినిగి పోతున్నాయి. ఈనెల 23న మున్సిపాలిటి కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అందుకు 187 అంశాలతో ఎజెండా తయారు చేశారు.అయితే 92వ ప్రతిపాదనలో రెండు విగ్రహాల ప్రారంభోత్సవాల ఖర్చుకు గాను రూ.60,000 అని ఉండి, కౌన్సిల్ ఆమోదం పొంది తీర్మానం చేశారు. జనవరి 5వ తేదీలోపు ప్రారంభోత్సవం చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ఎస్ఎస్ఏలను రెగ్యులరైజ్ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టగా మాజీ ఎమ్మెల్యే గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పే స్కేల్ అమలు చేయాలన్నారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహ్మద్ ఫరీద్, సంఘం నాయకులు వీరన్న,ఖాదర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న శంకర్‌నాయక్

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- డీఎస్పీ కృష్ణకిశోర్

తొర్రూరు : శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని డీఎస్పీ కృష్ణకిశోర్ తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ..నేరగాళ్లపై ప్రత్యేక నిఘా పెట్టి వారి కదలికలపై దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారం, మత్తు పదార్థాలు, ఇసుక, రేషన్ బియ్యం, మట్టి అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ జగదీష్, ఎస్సై ఉపేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణకిశోర్

వైభవంగా అయ్యప్ప నగర సంకీర్తన

- రథంలాగిన ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : మానుకోట పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ధ్వజారోహణ మహోత్సవం, మండల పూజల ముగింపులో భాగంగా అయప్ప స్వామివారి నగర సంకీర్తన గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి రథంలాగి ముందుకు సాగనంపారు. ఆలయ కమిటీ చైర్మన్ గద్దె రవి గురుస్వామి ఆధ్వర్యంలో కేరళ తంత్రి బ్రహ్మశ్రీ కేశవన్ నంబూద్రి, దేవాలయ పూజారి బ్రహ్మశ్రీ మాధవన్ నంబూద్రి, కేరళ సాంప్రదాయం ఉదయం శ్రీభూతబలి, కనకాభిషేకం, ధ్వజ పతాక అవరోహణ పూజలు చేశారు. శోభాయమానంగా అలంకరించిన రథంపై శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారిని కొలువుదీర్చి వాయిద్యాల మధ్య పట్టణంలో ఊరేగించారు.



రథం లాగుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అదృష్టవంతుడు.. ఈ రైతు



రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ గెలుచుకున్న రైతు గణేష్

కొత్తగూడ: వ్యాపారులు రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించి బహుమతులు గెలుచుకోవడం, విదేశీ యాత్రలు చేయడం చూశాం .. కాని మొదటిసారి కోరమండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన గ్రోమోర్ రైతు సంబరాల్లో మండలంలోని రేణ్యతండాకు చెందిన రైతు మాలోత్ గణేష్ సుమారు రూ.2.5 లక్షల విలువైన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనం గెలుచుకోవడం గమనార్హం. కంపెనీ ప్రతినిధులు భాస్కర్ రెడ్డి, సుజన్‌కుమార్ చేతులమీదుగా ద్విచక్రవాహనాన్ని గురువారం రైతు అందుకున్నాడు. అధీకృత డీలర్ల వద్ద బిల్లు తీసుకుని రైతులు తమకు అవసరమైన ఎరువులు తీసుకోవడం వల్ల ఇలాంటి అవకాశాలు కంపెనీ కల్పిస్తున్నదని భాస్కర్‌రెడ్డి తెలిపారు. డీలర్ పబ్బ శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి

మహబూబాబాద్ : రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరి డిమాండ్‌చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుకు సమస్యలపై వినతి పత్రం ఇవ్వడంతో ఇటీవల డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు సన్మానం చేశారు. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం డీలర్ల విషయంలో మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.5,000 గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటనారాయణ, యాకయ్య, వెంకన్న, రాంచందర్‌రావు, శంకర్, శ్రీను, వేణుగోపాల్, సుధాకర్, వెంకన్న, భాస్కర్, కిషన్, గురులింగం, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

'ప్రజా ఉద్యమాలను బలోపేతం చేద్దాం'



కురవి: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



దంతాలపల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి లింగన్న

కురవి : విప్లవకారుల ఐక్యతతో ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న పిలుపునిచ్చారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ.. విప్లవ పార్టీలు ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, బిక్షం, కోడి నర్సయ్య, వీరన్న, వెంకటాద్రి, రవి, భాస్కర్, నరసింహ పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయాలి

దంతాలపల్లి : సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసి పార్టీల విలీన సభ జయప్రదం చేయాలని న్యూడెమోక్రసి తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న కోరారు. మండల కేంద్రంలో ఈ నెల 28న జరిగే విలీన సభ పోస్టర్ గురువారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం విప్లవ పార్టీలు అవతరించాయన్నారు. ఆ పోరాటంలో లక్షల ఎకరాలు పేదలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవ పార్టీలదే అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకన్న, ఇరుగు నాగన్న, గొడిశాల మనోజ్, వెంకన్న, మల్లేష్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటులో ఎమ్మెల్యే నిర్లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : నెక్కొండ మున్సిపాలిటీ ఏర్పాటులో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పాటు కావడం ఖాయమని బలమైన సంకేతాలు వినిపిస్తున్నాయని చెప్పారు. నెక్కొండ మున్సిపాలిటీ కలగానే మిగలనుందని ఆందోళన వెలిబుచ్చారు. మున్సిపాలిటీపై ఎమ్మెల్యే మాధవరెడ్డి స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఆయన పట్టించుకోకపోవడంతో స్పష్టత కరువై ప్రజల్లో అయోమయం నెలకొందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీగా ఎన్నికలకు పోతుందా? లేక మున్సిపాలిటీగా ఎన్నికలకు పోతుందా? అనే విషయమై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'మద్యం వ్యాపారుల దోపిడీని అరికట్టాలి'



కంబాలపల్లిలో ఆందోళన చేస్తున్న నాయకులు

బయ్యారం : మద్యం ప్రియుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్న మద్యం వ్యాపారుల దోపిడీని అరికట్టాలని న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. మద్యంపై ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని కంబాలపల్లిలో గురువారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బయ్యారం, గార్ల మండలాల్లో 250 అక్రమ బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి ప్రతి వీధిలో మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారన్నారు. మద్యం వ్యాపారులు అక్రమంగా దోపిడీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వ్యాపారుల దోపిడీని అరికట్టాలని లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నర్సింహ, భిక్షపతి, కృష్ణ, చంద్రయ్య, రాము, జనార్దన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గార్ల: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకన్న



దంతాలపల్లి: సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సీపీఐని స్థాపించి వందేళ్లు అవుతున్న సందర్భంగా శతాబ్ది వేడుకల్లో భాగంగా పలువురు పార్టీ జెండాలు ఆవిష్కరించారు. దేశంలో దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం సీపీఐ ఆవిర్భవించిందన్నారు. తెలంగాణలో నిజాంకు, దొరలు, జమీందార్లకు వ్యతిరేకంగా, భూమి, భుక్తి , వెట్టిచాకిరి విముక్తికోసం సాగిన పోరాటంలో అనేక మంది కామ్రేడ్స్ పాల్గొన్నారన్నారని వారు గుర్తుచేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు: సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ నాయకులు



కురవి: బలపాలలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం..



మరిపెడలో జెండావిష్కరిస్తున్న నాయకులు



నెల్లికుదురు మండల కేంద్రంలో..

అనారోగ్యంతో కారోబార్ మృతి

పెద్దవంగర : మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన బైన రవికుమార్ (35) అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామంలో ఎనిమిదేళ్లుగా కారోబార్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. కాగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతిడికి భార్య ప్రవళిక, కూతురు, కుమారుడు ఉన్నాడు.బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద జీపీ తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని కార్యదర్శి హేమలత అందజేశారు. తహసీల్దార్ మహేందర్, మాజీ సర్పంచ్ దుంపల జమున సమ్మయ్య, వేముల వెంకన్న, దుంపల కుమారస్వామి, ఆయా గ్రామాల జీపీ కార్యదర్శులు, నాయకులు, కారోబార్లు తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రవి కుమార్ (ఫైల్)

ట్రాక్టర్ ఢీకొని యాచకుడికి గాయాలు

దంతాలపల్లి : మండలకేంద్రంలో ఓ (యాచకుడు)వృద్ధుడిని ట్రాక్టర్ ఢీకొనగా తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలానికి చెందిన బాదావత్ భిక్కు కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తు జీవిస్తున్నాడు. ఈక్రమంలో మండలంలో భిక్షాటన చేస్తు రోడ్డు దాటుతుండగా బీరిశెట్టిగూడెం గ్రామం నుంచి తొర్రూరు వైపు రాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఆ ట్రాక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన రాపోలు కనకయ్యదిగా గుర్తించారు. బీరాశెట్టిగుడెంలో వడ్డెర పని నిమిత్తం వచ్చినట్లు తెలిసింది.



గాయపడిన వృద్ధుడు భిక్కు

'మావో ఆలోచనా విధానం కొనసాగించాలి'



మావో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాయన్న

నెల్లికుదురు : దళారులు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ మావో ఆలోచనా విధానాన్ని కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న అన్నారు. మండల కేంద్రంలో మావో జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, వీరన్న, నరేష్, వెంకన్న, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు చేసి, కాంటా వేసిన బస్తాలను తరలించేందుకు లారీలు లేక, మూడ్రోజులుగా ముసురు పెడుతుండడంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. మిల్లులన్ని ధాన్యంతో నిండి పోవడంతో లారీలను పంపడంలో ఆలస్యమవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రైతులందరు కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని అమ్ముకున్నారు. కానీ లారీలు రాకపోవడంతో కొందరు రైతులు రోజుల తరబడి అక్కడే కాపు గాస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలకు లారీలు వచ్చేల చర్యలు తీసుకోవాలని నిర్వాకులతో పాటు రైతులు డిమాండ్ చేశారు.



నిల్వ ఉన్న కాంటా వేసిన ధాన్యం బస్తాలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ :
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
వి. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646